సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 13 । మే । 2024



గోదారిలో ఆరిన ఇంటి దీపాలు

వాడపల్లి వెంకటేశ్వరస్వామి దర్శనానికని వెళ్లిన ముగ్గురు ముగ్గురు మహిళలు గౌతమీ గోదావరిలో మునిగి దుర్మరణం పాలయ్యారు.

- 8లో



యువోత్సాహం

కొత్తగా ఓటు హక్కు పొందిన యువత పోలింగ్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తోంది. సమర్థ పాలన అందించే నేతలకు ఓటు వేసేందుకు ఉత్సాహం చూపుతోంది.

-8లో

గరిష్టం/కనిష్టం
40.0° / 27.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	40.0	27.0
కాకినాడ	35.5	27.6
అమలాపురం	38.0	28.0

న్యూస్‌రీల్

ప్రజాస్వామ్య పండగను విజయవంతం చేయాలి

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- కొత్తపేటలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలన
- అధికారులు, సిబ్బందికి సూచనలు

కొత్తపేట: ఐదేళ్లకు ఒకసారి వచ్చే ప్రజాస్వామ్య పండగను విజయవంతం చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఓటర్లకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ, పార్లమెంటు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం జరగనున్న పోలింగ్‌కు సంబంధించి స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ శుక్లా ఆదివారం మధ్యాహ్నం సందర్శించారు. ఈవీఎంలు, పోలింగ్ సామగ్రి స్వీకరణ, పోలింగ్ సిబ్బంది హాజరు డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియను పరిశీలించారు. ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి (ఆర్ఓ) జీవీవీ సత్యనారాయణ, ఏఈఆర్ఓలతో డిస్ట్రిబ్యూషన్, ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని దృష్ట్యా త్వరితగతిన పోలింగ్ సిబ్బందిని, భద్రతా సిబ్బందిని వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికల పోలింగ్‌లో జిల్లా ఓటర్లు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ సామగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం తనిఖీ చేసుకోవాలని సూచించారు. సూక్ష్మ పరిశీలకులతో సెక్టార్ ఆఫీసర్ మార్గ దర్శకత్వంలో పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఆయా పీఎస్‌లలో చేపట్టాల్సిన కార్యక్రమాలను సమగ్రంగా చేపడుతూ పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని సూచించారు. కొద్దిపాటి వర్షం పడినా సురక్షితంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను రిసెప్షన్ కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేపట్టామన్నారు. జిల్లా ఓటర్లు తమ ఓటు హక్కును పూర్తిస్థాయిలో వినియోగించుకుని పోలింగ్ శాతాన్ని పెంచాలన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

జిల్లా ఎస్పీ శ్రీధర్ హెచ్చరిక



అమలాపురం టౌన్: శాంతి భద్రతలకు ఎవరు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదు. ఎన్నికల సజావుగా సాగేందుకు జిల్లా ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ సునరావు శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సందర్భంగా జిల్లా అంతటా ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్న దృష్ట్యా అయిదుగురి కంటే ఎక్కువ మంది ఓ చోట గుమికూడితే కఠిన చర్యలు తప్పవని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది, మాజీ ఆర్మీ ఉద్యోగులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదివారం రాత్రి జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం నిబంధనలను మరోసారి గుర్తు చేశారు. ఓటర్ల సెల్‌ఫోన్లను పోలింగ్ బూత్‌లోకి అనుమతించేది లేదని ఎస్పీ స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చినవారు తప్ప ఇతరులెవరూ ఉండకూడదు. వాహనాలకు కూడా అనుమతి లేదన్నారు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి మాత్రమే పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి ఓటింగ్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించుకునేందుకు అనుమతి ఉందని చెప్పారు. పోలింగ్ జరుగుతున్న సమయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా పోలీసు సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, బాలింతలు, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బంది, అసౌకర్యం లేకుండా ఓటు హక్కు ప్రశాంతంగా వినియోగించుకునేలా సిబ్బంది సహకరించాలన్నారు. సోషల్ మీడియాలో పుకార్లు, అనవసరమైన వార్తలను వ్యాప్తి చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ శ్రీధర్ స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో పోలీసు అధికారులు, సిబ్బంది, ఇతర సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లోవకు ఎన్నికల ఎఫెక్ట్



లోవ దేవస్థానంలో స్వల్పంగా ఉన్న భక్తులు

తుని రూరల్: లోవ దేవస్థానానికి వచ్చే భక్తులపై సార్వత్రిక ఎన్నికల ప్రభావం తీవ్రంగా పడింది. సాధారణంగా ఆదివారం 10 వేల మంది వరకు భక్తులు లోవ దేవస్థానికి వచ్చి తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకుంటారు. కాగా సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈ వారం లోవకు వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 4 వేల మంది భక్తులు తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నట్టు ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలు, పూజా టికెట్లు, వసతి గదుల అద్దెలు, తదితర వివిధ విభాగాల నుంచి రూ. 1,71,283 ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు.

ప్రతి గడపనా.. ప్రగతి బావుటా

- ఉమ్మడి తూర్పున రూపురేఖలు మారిన పల్లెలు
- అధునాతన సౌకర్యాలతో బడులు, ఆసుపత్రులు
- సచివాలయాలు, ఆర్‌బీకే, విలేజ్ క్లినిక్‌లతో గ్రామాల్లోనే సేవలు
- పారిశ్రామికాభివృద్ధికీ పెద్ద పీట
- కళ్ల ముందే కనిపిస్తున్న మార్పు



ఐ.పోలవరం మండలం పశువుల్లంక మొండి వద్ద వృద్ధగౌతమీ పాయపై నిర్మించిన వంతెన



పి.గన్నవరం మండలం గంటిపెద పూడి వద్ద వశిష్ఠ నదిపై వంతెన నిర్మాణానికి వేగంగా సాగుతున్న పియర్ల నిర్మాణ పనులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఎందరో ఉద్దండులు ఏలిన ఉమ్మడి తూర్పు గోదావరి రాజకీయ చైతన్యానికి మారుపేరు. పునర్విభజనతో ఈ జిల్లా కాస్తా మూడు జిల్లాలైంది. అనంతరం తొలిసారి జరుగుతున్న ఈ సార్వత్రిక ఎన్నికలు రాజకీయంగా ఎంతో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. సహజంగానే రాజకీయాల్లో 'తూర్పు' సెంటిమెంట్‌ను బలంగా విశ్వసిస్తారు. ఈ జిల్లాల ప్రజలు ఇచ్చే తీర్పు రాష్ట్ర దశ, దిశలను నిర్దేశిస్తాయని నమ్ముతారు. నాటి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అరకు లోయతో కలిపి నాలుగు లోక్‌సభ, 19 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండేవి. వీటిలో ఒకటైన రంపచోడవరం జిల్లాల విభజన అనంతరం పాడేరు జిల్లాలో కలిసింది. ఉమ్మడి జిల్లాలో జరిగిన 2019 సార్వత్రిక ఎన్నికల్లో నాటి ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ సీపీ, అధికార పక్షమైన టీడీపీల మధ్య పోరు హోరాహోరీగా జరిగింది. ఈ పోరులో టీడీపీ కేవలం నాలుగంటే నాలుగు (పెద్దాపురం, రాజమండ్రి సిటీ, రాజమండ్రి రూరల్, మండపేట) అసెంబ్లీ స్థానాలకే పరిమితమైంది. మిగిలిన 14 అసెంబ్లీ స్థానాలతో పాటు, కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం, అరకులో ఎంపీ సీట్లలో ప్రజలు అప్రతిహతమైన మెజార్టీలు అందించడంతో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించింది. నాడు ప్రతిపక్ష నేతగా నిర్వహించిన ప్రజాసంకల్ప యాత్ర ద్వారా తన దృష్టికి వచ్చిన అనేక సమస్యలకు పరిష్కారం చూపాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గట్టి పట్టుదలతో మేనిఫెస్టో రూపొందించారు. దీనిని తు.చ. తప్పకుండా అమలు చేస్తారనే నమ్మకంతో వైఎస్సార్ సీపీకి దాదాపు అన్ని వర్గాల ప్రజలూ పట్టం కట్టారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా..

వారి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగించారు. ఆర్థికంగా అన్ని వర్గాలకూ లబ్ధి చేకూర్చడం ద్వారా ప్రతి ఇంటా ప్రగతి జెండా ఎగురవేశారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు 99 శాతం పైగా అమలు చేశారు. పార్టీ, కులం, మతం, వర్గం చూడకుండా అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందజేసి ప్రజల మనసుల్ని చూరగొన్నారు. ప్రధానంగా గ్రామ/వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే తీసుకుని వచ్చారు. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారకుండానే అవ్వాతాతల ఇళ్ల తలుపు తట్టి మరీ పింఛన్లు అందించారు. 'నాడు–నేడు'తో బడులు, ఆస్పత్రుల స్వరూపాన్నే మార్చేసి, విప్లవాత్మక మార్పులకు నాంది పలికారు. కోవిడ్ వంటి కష్టకాలం ఎదురైనా, ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా కరోనా బాధితులకు వెన్నంటే నిలిచి, వారి ప్రాణాలకు భరోసా ఇచ్చారు.

ప్రగతికి పెద్దపీట

- పల్లె, పట్టణమనే తేడా లేకుండా అవసరమైన ప్రతిచోటా రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు.
- ఉమ్మడి జిల్లాలో గ్రామ/వార్డు సచివాలయాలు, వైద్య, ఆరోగ్య రంగం, ఇతర రంగాలతో పాటు మునుపెన్నడూ లేనివిధంగా కారుణ్య నియామకాల ద్వారా వేలాది మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారు.
- నూతన పారిశ్రామిక విధానం ద్వారా కాకినాడ జిల్లావ్యాప్తంగా గడచిన ఐదేళ్లలో రూ.875.18 కోట్ల పెట్టుబడులతో 3,586 మందికి ఉపాధి కల్పించేలా 10 పెద్ద పరిశ్రమలు స్థాపించారు. వీటిలో రూ.330 కోట్లతో 5 రొయ్యలు ప్రాసెసింగ్‌కు సంబంధించినవి ఉండటం విశేషం. వీటి ద్వారా రోజుకు 232 టన్నుల రొయ్యలను శుద్ధి చేస్తున్నారు. సుమారు 2,956 మంది నేరుగా ఉద్యోగాలు పొందారు. ఇంకా యు.కొత్తపల్లి మండలం కేఎస్ఈజెడ్‌లోని పొన్నాడ, పెద్దాపురం మండలం జి.రాగంపేట, ప్రత్తిపాడు మండలం లంపకలోవ వద్ద వివిధ పరిశ్రమల ఏర్పాటు ద్వారా వేలాది మందికి ఉద్యోగాలు లభించాయి. ఆక్వా, ఆహార పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నారు.
- కాకినాడ జిల్లాలో 2019–20 నుంచి ఇప్పటి వరకూ రూ.390 కోట్ల పెట్టుబడులతో 3,516 మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా 16,394 మంది ఉపాధి పొందుతున్నారు.
- నవ్య తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురంలో ఆదిత్య బిర్లా గ్రూప్ తొలి దశలో రూ.1,000 కోట్లు, రెండో దశలో మరో రూ.1,500 కోట్లు కలిపి మొత్తం రూ.2,500 కోట్ల పెట్టుబడితో గ్రాసిమ్ కాస్టిక్ సోడా ప్లాంట్ నిర్మించింది. దీని ద్వారా 2,500 మందికి ఉపాధి దక్కుతోంది.
- గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామంలో రూ.260 కోట్ల అంచనాతో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. దీనికి ఏపీఐఐసీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.13.50 కోట్ల విలువైన 20.07 ఎకరాల భూమి కేటాయించింది. ఈ పరిశ్రమ నిర్మాణం పూర్తయితే 210 మందికి పైగా నిరుద్యోగులకు ఉపాధి దక్కుతుంది.

జిల్లాలో అభివృద్ధి జరిగిందిలా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

- జిల్లాలో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేశారు. లంక గ్రామాలకు వారధులు నిర్మించారు. రహదారులను బాగు చేశారు.
- గోదావరి లంక, మత్స్యకార గ్రామాల దాహార్తిని తీర్చేందుకు రూ.1,650 కోట్లతో మెగా వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తున్నారు.
- రూ.450 కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయి.
- 979.734 ఎకరాల లంక భూములకు సంబంధించి 2,991 మంది లబ్ధిదారులకు లీజు పట్టాలు పంపిణీ చేశారు.
- నాడు–నేడులో ఆరు పీహెచ్‌సీలను రూ.9.21 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు.
- గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా 515 సచివాలయాలను అభివృద్ధి చేశారు. రూ.72.88 కోట్లతో 1,102 పనులు చేపట్టారు.
- మన బడి నాడు–నేడు కింద మొదటి విడతలో 436 పాఠశాలలను రూ.104.96 కోట్లతో అభివృద్ధి చేశారు. రెండో విడతలో 761 పాఠశాలలను, 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలను రూ.257 కోట్లతో కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నారు.
- పేదలకు రికార్డు స్థాయిలో మొదటి విడతలో 24,644 ఇళ్లు మంజూరు చేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన వైఎస్సార్ పట్టణ పథకం ద్వారా రూ.443.59 కోట్లతో, ప్రధానమంత్రి ఆవాస్ యోజన వైఎస్సార్ గ్రామీణ పథకం ద్వారా 9,810 ఇళ్ల నిర్మాణం రూ.176.58 కోట్లతో జరుగుతున్నాయి.
- ప్రతి ఇంటికీ కుళాయి ఇవ్వాలనే సంకల్పంతో 1,834 ఆవాసాల్లో రూ.515.93 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంకులు, పైపులైన్లు నిర్మించారు. 209 జగనన్న కాలనీ లే అవుట్లలో కుళాయిల ఏర్పాటుకు రూ.45.75 కోట్లు కేటాయించారు.
- గడచిన ఐదేళ్లలో రహదారులు, భవనాల నిర్మాణాలకు రూ.299.40 కోట్లు ఇచ్చారు.
- పి.గన్నవరం మండలంలో లంక గ్రామాల ప్రజల కష్టాలను గట్టెక్కించేందుకు ముఖ్యమంత్రి హామీ మేరకు రూ.49.50 కోట్లతో గోదావరిపై వంతెన పనులు చురుకుగా జరుగుతున్నాయి.

సమపాళ్లలో అభివృద్ధి, సంక్షేమం

ఉమ్మడి జిల్లాలో ప్రజలకు రూ.వేల కోట్లతో సంక్షేమం, అభివృద్ధిని అందించి, ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వం తోడుగా నిలిచింది. పారిశ్రామికాభివృద్ధికీ పెద్ద పీట వేస్తోంది. ఆ ధైర్యంతోనే 'మీ ఇంటిలో ఈ ప్రభుత్వం వల్ల ఏదైనా మంచి జరిగి ఉంటేనే ఓటేయండి' అని ఎన్నికల ప్రచార సభల్లో సీఎం జగన్ ధైర్యంగా అడిగారు. దీనికి అనుగుణంగానే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రజలు సోమవారం జరిగే పోలింగ్‌లో అన్ని వర్గాలకూ మంచి చేసిన ముఖ్యమంత్రికి మద్దతు తెలిపేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. వారితో పాటు హైదరాబాద్, బెంగళూరు వంటి సుదూర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో ఓటర్లు బస్సులు, రైళ్లలో ఒక రోజు ముందుగానే స్వస్థలాలకు ఆదివారం నాటికే చేరుకున్నారు. మరికొందరు సోమవారం ఉదయానికి చేరుకోనున్నారు. గడచిన ఐదేళ్లుగా తమ తమ కుటుంబాలకు జరిగిన మేలును, కళ్ల ముందే కనిపిస్తున్న మార్పును గుర్తుంచుకుని, సంక్షేమ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలనే సంకల్పంతో వారున్నారు. గతంలో జన్మభూమి కమిటీల అరాచకాలు, అక్రమాల పాలన మరోసారి వద్దు బాబూ అంటూ ఓటుతో బుద్ధి చెప్పాలని భావిస్తున్నారు. 2014లో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయని చంద్రబాబు.. ఇప్పుడు ప్రకటించిన సూపర్ సిక్స్, సెవెన్ హామీలను సైతం ప్రజలు నమ్మే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పుడున్న పథకాలకు డబుల్, త్రిబుల్ ఇస్తానంటూ ఆయన ఊదరగొడుతున్నా జన స్పందన కరువవుతోంది. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో పరుగులు పెట్టించిన ప్రస్తుత ప్రభుత్వానికే మరోసారి మద్దతుగా నిలవాలనే సంకల్పంతో ఆయా వర్గాలు సిద్ధమవుతున్నాయి.

- కొవ్వూరు మండలం ఇసుకపట్ల పంగిడి గ్రామం వద్ద రూ.1,350 కోట్ల పెట్టుబడితో త్రివేణి రెన్యువబుల్స్ సంస్థ ఆధ్వర్యాన సోలార్ గ్లాస్ తయారీ పరిశ్రమ ఏర్పాటైంది. దీని ద్వారా 2,400 మందికి ఉద్యోగాలు లభించాయి.
- ఇంకా నల్లజర్ల మండలం పోతవరం, పెరవలి మండలం ఖండవల్లి గ్రామం వద్ద ఏర్పాటవుతున్న పరిశ్రమల ద్వారా వేలాది మందికి ఉపాధి లభించనుంది. జిల్లా వ్యాప్తంగా 2,427 ఎంఎస్ఎంఈల ఏర్పాటు ద్వారా 10,179 మందికి ఉపాధి అవకాశాలు లభించాయి.

ఐదేళ్ల భవితకు ఒక్కవేలుపై చుక్క!

- నేడు సార్వత్రిక ఎన్నికల పోలింగ్
- జిల్లాగా ఏర్పడిన తరువాత ఇదే తొలిసారి
- ఒక లోక్‌సభ, ఏడు అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు
- ఎంపీగా పోటీలో 15 మంది... అసెంబ్లీ బరిలో 91 మంది
- ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్
- జిల్లాలో 15.31 మంది ఓటర్లు... 1,644 పోలింగ్ కేంద్రాలు
- 15,600 మంది పోలింగ్ సిబ్బంది
- 13 కంపెనీల కేంద్ర బలగాలు

స్వతంత్రం వచ్చిన నాటి నుంచి ఓటు



ఆలమూరు మండలం పెద పళ్లకు చెందిన ఈ శతాధిక వృద్ధుడు పేరు చిలుకూరి చిన పట్టాభి. 1923 సంవత్సరంలో పుట్టారు. ప్రస్తుతం ఈయన వయస్సు 101 సంవత్సరాలని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. పట్టాభి స్వతంత్రం వచ్చిన నాటి నుంచి ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఈసారి శరీరం పెద్దగా సహకరించకున్నా చక్రాల కుర్చీలో వెళ్లి అయినా ఓటు వేయాలని నిర్ణయించుకున్నారు.



హోప్ ఐలాండ్‌లో విధులు నిర్వహించడానికి వెళుతున్న ఎన్నికల సిబ్బంది

సాక్షి అమలాపురం: నేతల తలరాతను రాసే ఓటరు విధాతలు తమ నిర్ణయాన్ని ప్రకటించడానికి సిద్ధమయ్యారు. సిరాచుక్కను చూపుడు వేలుపై వేయించుకొని ఐదేళ్ల తమ భవిష్యత్తును తామే నిర్దేశించుకోవడానికి జనం సమాయత్తమయ్యారు. సార్వత్రిక ఎన్నికల మహా సంగ్రామంలో కీలకమైన పోలింగ్ మరికొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. సార్వత్రిక ఓట్ల పండగ జిల్లాలో సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి మొదలవనుంది. ఒక లోక్‌సభ, ఏడు అసెంబ్లీ స్థానాలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా 15.13 లక్షల మంది ఓట్లు వినియోగించుకోనున్నారు. ఓటు కోసం సుదూర ప్రాంతాల్లో ఉన్న వలస జీవులు రెక్కలు కట్టుకుని వచ్చి వాలిపోయారు. కొత్త ఓటర్లు తొలి ఓటు వేసేందుకు ఉత్సాహంతో ఉన్నారు. నెలరోజులపాటు తీవ్రంగా కాసిన ఎండలలో ఆపసోపాలు పడుతూ తిరిగిన అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్ల తేల్చనున్నారు. కొత్త జిల్లా ఏర్పడిన తరువాత తొలిసారిగా జరుగుతున్న ఎన్నికలను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. సోమవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరగనుంది. జిల్లా వ్యాప్తంగా 1,644 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వెబ్ కాస్టింగ్ చిత్రీకరణ 1,200 పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేశారు. 15,600 మంది పోలింగ్ విధులు నిర్వహిస్తున్నారు. పోలింగ్ సిబ్బంది తరలింపునకు 497 బస్సులు, 40 మినీ బస్సులు, 310 టాటా మ్యాజిక్‌లు, 233 ఇతర వాహనాలు వెరసి 757 అందుబాటులో ఉంచారు. జిల్లావ్యాప్తంగా 149 రూట్లుగా విభజించారు. ఎన్నికల విధులలో పాల్గొనే పోలింగ్ సిబ్బంది సమస్యలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకునేందుకు 149 మంది సెక్టార్ అధికారులను నియమించారు. పోలింగ్ కేంద్రంలో వీల్‌చైర్‌తో పాటు కనీస వసతులు కల్పించారు. సహాయ వ్యయ పరిశీలకుల బృందాలు ఎనిమిది, అకౌంటింగ్ టీములు ఎనిమిది, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 64, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాలు 64, వీఎస్‌టీ బృందాలు 14, వీడియో బృందాలు ఏడు ఎన్నికలలో పనిచేయనున్నాయి. 24/7 కంట్రోల్ రూమ్ జిల్లా కేంద్రంలో పని చేయనుంది. కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామ పరిధిలో శ్రీనివాస ఇంజినీరింగ్ కాలేజీలో రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లు ఏర్పాటు చేశారు.

15.31 లక్షల మంది ఓటర్లు

జిల్లాలో 15,31,410 ఓటర్లు ఉన్నారని, వీరిలో సర్వీస్ ఓటర్లు 819 మంది కాగా, 85 సంవత్సరాలు వయస్సు పైబడిన వృద్ధులు 8,344 మంది ఉన్నారన్నారు. దివ్యాంగ ఓటర్లు 26,309 మంది వరకు ఉన్నారు. జిల్లాలో వెయ్యి మందికి పైగా ఓటర్లు కలిగి ఉన్న పోలింగ్ కేంద్రాలు 600 వరకు ఉన్నాయి.

ఎన్నికల సామగ్రి పంపిణీ

అసెంబ్లీల వారీగా పోలింగ్ సామగ్రిని సిబ్బందికి ఎంపిక చేసిన ప్రాంతాల్లో అధికారులు అందజేశారు. రామచంద్రపురంలో వీఎస్ఎం కాలేజీ బీ బ్లాక్, ముమ్మిడివరం ఎంజీఆర్ జూనియర్ కళాశాల, అమలాపురం ప్రభుత్వ జూనియర్ మహిళా కాలేజీ, రాజోలు స్థానిక బాలుర ఉన్నత పాఠశాల, పి.గన్నవరం వీవీఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల, కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండపేట వీఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో సామగ్రి అందజేశారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంపై జిల్లా యంత్రాంగం భారీ కసరత్తు చేసింది. దీనిలో భాగంగా 563 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. అత్యధికంగా కొత్తపేటలో 119 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయి. వీటి వద్ద అదనపు భద్రతా చర్యలు చేపట్టారు. గత ఎన్నికల కంటే నాలుగు రెట్లు ఎక్కువగా భద్రతా బలగాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో మోహరించారు. ఇప్పటికే 144 సెక్షన్ అమలులో ఉంది. మొత్తం 2,900 మంది భద్రతా సిబ్బంది పోలింగ్ విధులలో ఉన్నారు. వీరిలో 1,600 మంది జిల్లా పోలీసులు కాగా, 1,300 మంది కేంద్ర బలగాల సభ్యులున్నారు.

పడవలపై పోలింగ్ సిబ్బంది

జిల్లాలోని గోదావరి, సముద్ర సంగమ ప్రాంతంలో ఉన్న పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది పడవలపై చేరుకున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని కాట్రేనికోన మండలం బ్రహ్మసమేధ్యం పంచాయతీ పరిధిలోని మగసానితిప్ప ఎంపీపీ పాఠశాలలో పోలింగ్ బూత్‌కు సిబ్బంది పడవలపై చేరుకున్నారు. ఇక్కడ మొత్తం 466 ఓట్లు ఉన్నాయి. ఐ.పోలవరం మండలం గుత్తెనదీవి శివారు గోగుల్లంకలో అంగన్‌వాడీ సెంటరులోని పోలింగ్ కేంద్రానికి సైతం సిబ్బంది పడవ మీద చేరుకున్నారు. ఇక్కడ 1,046 ఓట్లు ఉన్నాయి.

వెల్లువలా వచ్చారు

సంక్రాంతి పండగకు వచ్చినట్టుగా ఓట్ల పండగకు వలస జీవులు పెద్ద ఎత్తున వస్తున్నారు. ఉపాధి, ఉద్యోగాలు, ఉన్నత చదువులు, వ్యాపారాల కోసం ఇతర రాష్ట్రాలలో ఉన్నవారు పెద్ద ఎత్తున తమ గ్రామాలకు వచ్చారు. రాష్ట్రంలోని ప్రముఖ నగరాలతోపాటు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, పూనే, ముంబై వంటి ప్రాంతాల నుంచి ఓటర్లు సొంత గ్రామాలకు చేరుకున్నారు. కొంతమందిని రప్పించేందుకు పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రత్యేక బస్సులు, ఖర్చులకు సొమ్ము ఇవ్వడంతో ఓటర్లు తండోపతండాలుగా వచ్చారు.

జల్లెడ పట్టారు

ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేయడంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టింది. జిల్లా నలుమూలలా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి మద్యం, నగదు రవాణా పంపిణీని నియంత్రించింది. రోడ్లపై తనిఖీ చేస్తూ నగదు, మద్యం సరఫరాను అడ్డుకుంది. నగదు, వస్తువుల విలువ రూ.8,12,42,542 కాగా, రూ.7,41,922 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. మొత్తం నగదు, మద్యం విలువ రూ.8,19,84,464 స్వాధీనం చేసుకున్నారు. 200 కిలోల గంజాయిని కూడా స్వాధీనం చేసుకున్నారు.

అకాల వర్షంతో అవస్థలు



కొత్తపేటలో వర్షం నీటిలో పోలింగ్ సామగ్రితో బయలుదేరిన సిబ్బంది

కొత్తపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం పోలింగ్‌కు సమాయత్తమవుతున్న వేళ ఆదివారం మధ్యాహ్నం అకాల వర్షంతో అధికారులు, సిబ్బంది తీవ్ర అవస్థలు పడ్డారు. కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఎన్నికకు సంబంధించి ఈవీఎంలు, పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌గా స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఉంది. నియోజకవర్గంలో మొత్తం 262 పోలింగ్ బూత్‌లకు సంబంధించి పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలు, ఇతర పరికరాలు, సామగ్రి పంపిణీ చేపట్టారు. అయితే వర్షం ఒక మోస్తరుగా ప్రారంభమై ఈదురు గాలులతో భారీగా కురిసింది. దాంతో ఆ ప్రాంగణంలో వేసిన టెంట్లు కొన్ని కుప్పకూలాయి. తమకు ఇచ్చిన ఈవీఎంలు, పరికరాలు, పోలింగ్ సామగ్రి తడవకుండా కాపాడుకోవడానికి సిబ్బందికి నానా ఇబ్బందులు పడ్డారు. ఆ ప్రాంగణం, బస్సులు నిలిపిన గ్రౌండ్ వర్షం నీటితో నిండిపోయింది. తమకిచ్చిన సామగ్రితో బయటపడటానికి సిబ్బంది నానా అవస్థలు పడ్డారు. ఎలాగోలా వెళ్లి బస్సుల్లోకి చేరుకోగా బస్సులు మట్టిలో దిగబడిపోయిముందుకు కదలకుండా మొరాయించాయి. జేసీబీలను రప్పించి ముందుకు కదిలించారు. అకాల వర్షం కారణంగా భోజనం కౌంటర్ల వద్ద సిబ్బంది ఇబ్బంది పడ్డారు.

ఓటేసేందుకు చెన్నై నుంచి...



అంబాజీపేట మండలం నందంపూడికి చెందిన చింతా చిట్టిబాబు ఓటు వేసేందుకు చెన్నై నుంచి వచ్చారు. చెన్నైలో ఓఎన్‌జీసీలో పనిచేస్తున్న చిట్టిబాబు వ్యయప్రయాశలకోర్చి స్వగ్రామం నందంపూడి చేరుకున్నారు. చెన్నై నుంచి రావడం ఇబ్బందికరమే అయినా ఓటు హక్కును వినియోగించుకోవడం కర్తవ్యంగా భావించి వచ్చానని ఆయన చెప్పారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలి. జిల్లాలో ఎన్నికలను నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఓటర్లు పెద్ద ఎత్తున వచ్చిన ఓటును వినియోగించుకోవాలి. ఈసారి ఎన్నికలలో ఓటింగ్ శాతం పెంచేందుకు పలు రకాల చర్యలు తీసుకున్నాం.

– హిమాన్షు శుక్లా, కలెక్టర్


ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



ఓటర్లు భయానికి, పక్షపాతానికి తావు లేకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునే ఏర్పాట్లు చేశాం. పోలింగ్ బూత్‌ల వద్ద నాలుగు అంచెల భద్రతను కల్పించాం. అసాంఘిక శక్తులు శాంతిభద్రతలకు ఏమాత్రం విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవు. వ్యక్తుల వద్దనున్న తుపాకులను స్వాధీనం చేసుకున్నాం. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం.

– ఎస్.శ్రీధర్, జిల్లా ఎస్పీ

తొలిసారి ఓటు వేయడం



నేను ఓటు వేయడం ఇదే తొలిసారి. చాలా సంతోషంగా, ఉత్సాహంగా ఉంది. మంచి పరిపాలన అందించే వ్యక్తికి ఓటు వేస్తాను. రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తూ, సంక్షేమ పథకాలు అమలు చేసే ప్రభుత్వం రావాలి.

– నల్లా మధు సత్యనారాయణ, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం మండలం

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గండేపల్లి: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామానికి చెందిన రాయుడు వీరబాబు (17) మోటార్ సైకిల్‌పై జగ్గంపేట వైపు నుంచి వస్తుండగా మండలంలోని మురారి శివారుకు వచ్చేసరికి మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పోల్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద స్థలం వద్దకు చేరుకున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది మృతుని కుటుంబానికి సమాచారం అందజేశారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అగ్ని ప్రమాదంలో రూ.5 లక్షల ఆస్తినష్టం



జగ్గంపేటలో అగ్ని ప్రమాదం జరిగిన భవనం

జగ్గంపేట: స్థానిక పెట్రోలు బంక్ పక్క వీధి దళితవాడలోని జగ్గంపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పాలకుర్తి సురేష్ ఇంటి రెండో అంతస్తులో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో రూ. 5లక్షల విలువచేసే విద్యుత్ పరికరాలు అగ్నికి ఆహుతి అయినట్లు జగ్గంపేట అగ్నిమాపక అధికారి లక్ష్మణరావు తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం పై అంతస్తులో షార్టు సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. మంటలను అదుపు చేయడానికి చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. పెద్దాపురం నుంచి మరో అగ్నిమాపక వాహనాన్ని రప్పించి పై అంతస్తు అద్దాలు పగులగొట్టి మంటలను అదుపు చేయవలసి వచ్చింది. విలువైన విద్యుత్ పరికరాలు కాలి బూడిద అయ్యాయని తెలిపారు.

కూతురిపై కత్తితో తండ్రి దాడి



కత్తి దాడిలో గాయపడిన రాణి

ఐ.పోలవరం: మండలంలోని పాతయింజరంలో కన్న కూతురిపై తండ్రి కత్తితో దాడి చేసిన ఘటన జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఎం.శివసుబ్రహమణ్యం ఆదివారం ఉదయం కూతురు రాణిపై కత్తితో దాడి చేశాడు. దీనితో రాణికి మెడపై బలమైన గాయం అవడంతో స్థానికులు యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కూతురిపై కత్తితో దాడి చేయడానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై ఎస్సై జె.భాను ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోలీసులు శివసుబ్రహ్మణ్యంను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

30 లీటర్ల సారా స్వాధీనం

పి.గన్నవరం: మండలంలోని గాజులగుంటలో శనివారం రాత్రి మట్టపర్తి శ్రీను ఇంట్లో సారా తయారు చేస్తుండగా ఎస్సై బి.శివకృష్ణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 30 లీటర్ల సారా, తయారీకి ఉపయోగిస్తున్న గ్యాస్ స్టౌ, సిలిండర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

గోదారిలో ఆరిన ఇంటి దీపాలు

- దైవ దర్శనానికి వెళుతూ మృత్యు ఒడిలోకి
- బాలికతో సహా ఇద్దరు మహిళల మృతి
- మడికి గ్రామంలో తీవ్ర విషాదం



మడికిలో సునీత మృతి వార్త విని శోక సంద్రంలో బంధువులు







పాలూరి సత్య అనంతలక్ష్మి, కొప్పిరెడ్డి ఏసమ్మ, కర్రి సునీత మృతదేహాలు

అలమూరు/ఆత్రేయపురం: ఆ ఇంటి దీపాలు గోదావరిలో పడి ఆరిపోయాయి. తమ జీవితాల్లో వెలుగులు నింపినవారు దైవ దర్శనానికని వెళ్లి మృత్యువాత పడ్డారని తెలియడంతో ఆ కుటుంబాల సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

వాడపల్లివెంకన్న దర్శనానికి బయలుదేరిన ఒక బాలిక, ఇద్దరు మహిళలు స్వామిని చూడకుండానే మృత్యువాత పడ్డారన్న చేదునిజం ఒక రోజు ఆలస్యంగా అయినవారికి తెలిసింది. గోదావరి దాటి వెళ్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని క్షేమంగా ఇంటికి తిరిగి వస్తారనుకున్న కుటుంబ సభ్యులు రాత్రి పొద్దుపోయే వరకూ రాకపోవడంతో నదిలో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం కనిపించలేదు. శనివారం వేకువజామున జరిగిన ఈ ఘటన ఆదివారం ఉదయం వరకూ వెలుగులోకి రాకపోవడంతో ఆ కుటుంబ సభ్యులు పడిన వేదన వర్ణనాతీతం.

తీవ్ర విషాదంలో మడికి..

ఒకే ప్రాంతానికి చెందిన ముగ్గురు మహిళలు ఒకేసారి, ఒకే విధంగా మృత్యువాత పడటంతో మడికిలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ పోషణలో చేదోడు వాదోడుగా ఉంటూ అన్నింటిలోను అర్ధ భాగమై పోయిన తమ ఇంటి దేవతలు లేరనే వార్తను మృత్యువాత పడిన మహిళల భర్తలు బుల్లెబ్బాయి, అన్నవరం జీర్ణించుకోలేకపోతున్నారు. ఇటీవల చెముడులంకలోని జెడ్పీ హైస్కూల్ పదో తరగతి పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించి ఉన్నత చదువులు చదవాలన్న ఆకాంక్ష ఉన్న సునీత అర్ధంతరంగా తనువు చాలించడంతో తల్లిదండ్రులు శ్రీనివాసు, వీరవేణి, సోదరి పద్మ కన్నీరు మున్నీరవుతున్నారు. మృతదేహాల వద్ద కుటుంబీకుల రోదిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో స్థానికులు తరలివచ్చి మృతుల కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్రవాహ ఉధృతి వల్లా.. ఊబి ఉందని తెలియకా?

అలమూరు మండలంలోని మడికి శివారు చిలకలపాడు నుంచి పాలూరి సత్య అనంతలక్ష్మి (40), సాంబారుపేటకు చెందిన కొప్పిరెడ్డి ఏసమ్మ (60), కర్రి సునీత (16) ప్రతి వారం మాదిరిగానే శనివారం ఆత్రేయపురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వాడపల్లిలోని శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని స్వచ్ఛంద సేవలను అందించేందుకు కాలినడకన బయలుదేరారు. ఏడు శనివారాల మొక్కులో భాగంగా ఇప్పటికే రెండుసార్లు వెళ్లినవారు శనివారం వేకువ జామున బయలు దేరారు. లంక గ్రామాల ప్రజలు తరచూ వాడపల్లి ఆలయానికి బడుగువానిలంక మీదుగా గోదావరి దాటి వెళుతుంటారు. అదేవిధంగా ఆ ముగ్గురు నడుస్తూ మార్గమధ్యలో ఉధృతంగా ప్రవహిస్తున్న నదీపాయ దాటుతున్నారు. నదీపాయ లోతు అంతగా ఉండదనే భావనతో నడుస్తూ తీరం చేరేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో మధ్యలోకి వచ్చేసరికి ఆ మహిళలు ప్రవాహ ఉధృతికి తట్టుకోలేక ఊబిలో చిక్కుకుని మునిగిపోయారు. ఈ ఘటన వేకువజామున జరగడంతో స్థానికులకు తెలియలేదు. వాడపల్లి వెంకన్న దర్శనానికని వెళ్లిన ఆ మహిళలు సాయంకాలానికి కూడా తిరిగి రాకపోవడంతో పాటు సెల్‌ఫోన్లు కూడా స్విచ్ఛాఫ్ అయిపోయి పనిచేయలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు శనివారం సాయంకాలం వాడపల్లిలోనున్న బంధువులు, సహచర భక్తుల వద్దకు వెళ్లి ఆచూకీ కోసం ప్రయత్నించినా, గాలింపు చర్యలు చేపట్టినా పురోగతి కనిపించ లేదు. దీంతో వారి కుటుంబ సభ్యులు ఆత్రేయపురం పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఎస్సై ఎస్.శ్రీనివాసుకు ఫిర్యాదు చేశారు. అప్పటికే పొద్దు పోవడంతో ఆదివారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్లను తీసుకువచ్చి గాలింపు చర్యలు చేపట్టడంతో ఎట్టకేలకు ఆ మహిళల ముగ్గురు మృతదేహాలు వేర్వేరు ప్రాంతాల్లో కూతవేటు దూరంలో లభించాయి. గోదావరి ప్రవాహ ఉధృతిని అంచనా వేయకుండా నదీపాయను దాటేందుకు ప్రయత్నించడం వల్ల కాని, ఊబి ఉంటుందని గ్రహించలేక పోవడం వల్ల కాని ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

యువోత్సాహం

- ఉరకలేస్తున్న కొత్త ఓటరు
- యువత ఆశయాలు అర్థం చేసుకునే నాయకుడే రావాలి
- సమర్థ పాలన అందించే వారికే ఓటు
- తొలిసారి ఓటు వేయబోతున్న యువ ఓటర్ల మనోగతం

జిల్లాలో యువ ఓటర్లు

నియోజకవర్గం	18-19	20-29	30-39
తుని	4,506	40,146	61,534
ప్రత్తిపాడు	3,550	36,958	61,386
పిఠాపురం	3,640	37,867	63,680
కాకినాడ రూరల్	3,999	41,358	68,199
పెద్దాపురం	3,416	35,771	60,036
కాకినాడ సిటీ	3,680	39,381	62,449
జగ్గంపేట	3,450	37,245	63,800
మొత్తం	24,241	2,68,776	4,41,084

కాకినాడ సిటీ: ఎన్నికల విషయంలో యువ ఓటర్ల దృక్పథం మారుతోంది. ఎన్నికల, ఓటింగ్‌పై గతంలో యువకులు పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు. ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు మొట్టమొదటిసారిగా ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. ఎన్నికల సంఘంతో పాటు, పలు సంస్థలు ఓటు ప్రాముఖ్యతపై విస్తృతంగా ప్రచారం చేయడంతో, యువత ఆలోచనా సరళి మారింది. 18 ఏళ్లున్న వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడంతో కాకినాడ జిల్లాలో యువ ఓటర్ల సంఖ్య పెరిగింది.

జిల్లాలో మొత్తం 16,99,122 మంది ఓటర్లుండగా, యువ ఓటర్ల సంఖ్య 7,36,101 మంది ఉన్నారు. ప్రజాస్వామ్యంలో తమకు నచ్చిన, మెచ్చిన నేతను ఎన్నుకునేందుకు వారు ఉవ్విళ్లూరుతున్నారు. రానున్న ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో చూపిస్తామంటున్నారు. అవినీతి రహితంగా, ప్రజాస్వామ్య బద్ధంగా పాలించే నేతనే ఎన్నుకుంటామని ప్రతినబూనుతున్నారు. యువత భవితకు భరోసా కలిప్పించాలని, పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నారు. నిత్యం ప్రజల్లో ఉండే నేతనే ఈసారి ఎన్నుకుంటామని చెబుతున్నారు.

తొలిసారిగా ఓటు వేసేందుకు..

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైన ఆయుధం. అలాంటి ఆయుధాన్ని తొలిసారిగా పొందిన యువత ఓటేసేందుకు సిద్ధమవుతోంది. భారత రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించింది. దేశంలో బీటెక్, డిగ్రీ, ఇతర యూజీ కోర్సులు చేస్తున్న వారు, తొలిసారిగా ఓటు హక్కు పొందారు. వీరంతా ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటేసి తమకు నచ్చిన ఎంపీ, ఎమ్మెల్యేలను ఎన్నుకోనున్నారు. కొత్తగా ఓటరుగా నమోదైన వారు సమర్థ నాయకత్వానికి ఓటు వేస్తామని, ఏళ్ల అనుభవం, ఇతర అంశాలను పట్టించుకోమన్నారు. యువత ఆశయాలను అర్థం చేసుకుని ముందుకు నడిపించ గలిగే నేతకు జై కొడతామంటున్నారు యువత. ఏ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నా యువత ఓటర్లే కీలకం. దీంతో అన్ని రాజకీయ పార్టీలు యువ ఓటర్లను ఆకర్షించే పనిలో నిమగ్నమయ్యారు. వీరు ఏ పార్టీకి మద్దతు పలికితే ఆ పార్టీ గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

నమ్మకం కలిగించాలి



నాయకుడనే వాడు ప్రజలకు నమ్మకం కలిగించాలి. విశ్వసనీయతకు మారుపేరుగా ఉండాలి. ఒకసారి అవకాశం ఇస్తే కొన్నేళ్లు పాటు దానిని సద్వినియోగం చేసుకుని ప్రజలకు మేలు చేయాలి. అలాంటి నాయకుడికే నా ఓటు.

– దడాల అక్ష, ఇంజినీరింగ్ విద్యార్థి, తూరంగి

పేద విద్యార్థులకు మేలు చేయాలి



ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉద్యోగ, విద్యావకాశాలు కల్పించాలి. కులం ప్రాతిపదికన కాకుండా, ఆర్థిక వెనుకబాటును ప్రామాణికంగా తీసుకుని అవకాశాలు కల్పించాలి. అలాంటి నాయకుడికే నా ఓటు.

– సీహెచ్ సిద్ధార్థ, డిగ్రీ విద్యార్థి, కాకినాడ

హామీలు నెరవేర్చాలి



ఎన్నికల్లో పోటీ చేసేవారు తాము ప్రకటించిన హామీలు, మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలు చేయగలిగాలి. అలాంటి వ్యక్తికే నేను ఓటు వేస్తాను. ఎన్నికల సమయంలో హామీలిచ్చి, వాటిని నెరవేర్చలేని నాయకులు మనకు అవసరం లేదు.

– చిల్లా కిషోర్, డిగ్రీ విద్యార్థి, కాకినాడ

మంచి నాయకుడిని ఎన్నుకుంటాం



అబద్ధపు హామీలిచ్చి మోసం చేసే నాయకుడిని కాకుండా, మంచి నాయకుడిని ఎన్నుకోవాలని నిర్ణయించుకున్నాను. భవిష్యత్తు తరాల గురించి ఆలోచించి, రైతులకు, మహిళలకు, పేద వర్గాల వారికి మేలు చేసే వారికే నా ఓటు.

– కాకర మణికంఠ, కాకినాడ

ఓటేసేందుకు విదేశాల నుంచి వచ్చిన సోదరులు



ఓటేసేందుకు విదేశాల నుంచి సొంతూరు వచ్చిన సోదరులు శ్రీనుబాబు, వీర వెంకట సత్యనారాయణ

అమలాపురం టౌన్: ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలన్న సంకల్పంతో ఆ సోదరులిద్దరూ విదేశాల నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించి సొంతూరికి వచ్చారు. వివరాల్లోకి వెళితే అమలాపురం రూరల్ మండలం బండారులంక శివారు బ్యాంక్ కాలనీకి చెందిన సోదరులు కుక్కల శ్రీనుబాబు, వీర వెంకట సత్యనారాయణ గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. శ్రీనుబాబు మస్కట్ దేశంలోని ఓ ఆయిల్ అండ్ గ్యాస్ ఇంజినీరింగ్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంటే, అతని సోదరుడు వీర వెంకట సత్యనారాయణ కువైట్ దేశంలో ఎలక్ట్రీషియన్ పనిచేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు సోదరులిద్దరూ శుక్ర, శనివారాల్లో సొంతూరికి చేరుకున్నారు. ఈ నెల 13వ తేదీ సోమవారం ఓట్లు వేసి తిరిగి తాము ఉద్యోగాలు చేస్తున్న దేశాలకు వెళ్లిపోతామని సోదరులు శ్రీనుబాబు, వీర వెంకట సత్యనారాయణ చెప్పారు. ఓట్లు వేయాలన్న సంకల్పం, బాధ్యతతోనే విదేశాల నుంచి వ్యయ భారమైనా వచ్చామన్నారు. దీంతో ఓటు హక్కుపై వారికున్న చైతన్యాన్ని స్థానికులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

మద్యం అక్రమ రవాణాపై విస్తృత దాడులు

ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను తనిఖీ చేసిన పోలీస్ అబ్జర్వర్



ముమ్మిడివరం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అధికారులతో పోలీస్ అబ్జర్వర్ చంద్రకాంత్

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికలు జరిగే ముందు రోజు జిల్లాలో నిఘా బృందాలు అక్రమ మద్యం, నగదు రవాణాపై ఆదివారం విస్తృత దాడులు, తనిఖీలు చేశాయి. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో జరిగిన దాడులు, తనిఖీల వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం ఆదివారం రాత్రి తెలిపింది.

- జిల్లాలో అక్రమ రవాణాకు సంబంధించి నిఘా బృందాలు 12 కేసులు నమోదు చేసి 11 మందిని అరెస్ట్ చేశాయి. వారి నుంచి 20 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 143 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 34.98 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్, 140 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నాయి.
- జిల్లా పోలీసులు, నిఘా బృందాల ప్రతినిధులు చెక్ పోస్ట్‌ల్లో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.13.40 లక్షల నగదును సీజ్ చేశారు.
- అమలాపురం టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో రూ.33, 210 నగదును సీజ్ చేశారు.
- అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాలకు సంబంధించి ఆయా నియోజకవర్గాల్లో ఆదివారం జరిగిన ఈవీఎంలు, పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను జిల్లా పోలీస్ అబ్జర్వర్, ఐపీఎస్ అధికారి ఎంవీ చంద్రకాంత్ తనిఖీ చేశారు. పోలింగ్ సామగ్రి పంపిణీ ఏ విధంగా జరుగుతోంది. సిబ్బంది భోజన ఏర్పాట్లు ఎలా ఉన్నాయి వంటి అంశాలపై ఆయన ఆరా తీశారు.



ఓటు ఇలా వేద్దాం...

రాజమహేంద్రవరం రూరల్: ఓటు వజ్రాయుధం, సరైన వ్యక్తిని ఎన్నుకునేందుకు రాజ్యాంగం ఇచ్చిన హక్కు. దాన్ని సద్వినియోగం చేసుకుంటే ఐదేళ్లు మనల్ని ఆ వ్యక్తి సరిగ్గా పాలిస్తాడు. మన హక్కును ఎలా వినియోగించుకోవాలి? పోలింగ్ కేంద్రంలోకి వెళ్లాక ఏం చేయాలి? అక్కడి అధికారులెవరు ఉంటారు? ఈవీఎంపై ఎలా ఓట్లు వేయాలి? అనే అంశాలను ఒక్కసారి చూద్దాం..

ఇవి వద్దు...

పోలింగ్ కేంద్రంలోకి ఓటర్లు, సెల్‌ఫోన్లు, కెమెరాలు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లకూడదు. సెల్ఫీలు తీసుకోవడం కూడా నేరం.

ఇలా చేయొద్దు...

మీరు ఈవీఎంలో ఒక బటన్ నొక్కిన తర్వాత మరో బటన్ నొక్కొద్దు. దీనివల్ల మీ ఓటు నమోదు కాదు. వృథా అవుతుంది. అందుకని ఒకసారి మాత్రమే బటన్ నొక్కి ఓటుహక్కును వినియోగించుకోవాలి.

నోటా...

బ్యాలెట్‌లో నోటా అనే ఆప్షన్ కూడా ఉంటుంది. మీకు పోటీలో నిలిచిన ఏ పార్టీ అభ్యర్థి నచ్చకపోయినా నోటా ఎదురుగా ఉన్న బటన్ నొక్కి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

పోలింగ్ కేంద్రంలో వీరికి మాత్రమే అనుమతి

- ప్రిసైడింగ్ అధికారి ఒకసారి ఎంతమంది ఓటర్లను లోనికి అనుమతిస్తే..వారు మాత్రమే రావాల్సి ఉంటుంది.
- పోలింగ్ అధికారులు, ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది
- ఎన్నికల సంఘం అనుమతించిన వ్యక్తులు
- అభ్యర్థులు, వారి ఏజెంట్లు, పోలింగ్ ఏజెంట్లు
- ఓటు వేయడానికి వచ్చినవారు, చంకన ఎత్తుకున్న పిల్లలు
- అంధులకు, వృద్ధులకు తోడుగా వచ్చిన వారు
- రిటర్నింగ్ అధికారి, ప్రిసైడింగ్ అధికారి, ప్రత్యేక పరిస్థితుల్లో నియమించిన వ్యక్తులు మాత్రమే పోలింగ్ రోజు కేంద్రంలోకి వెళ్లే అవకాశం ఉంటుంది.
- ఈ నిబంధనలు అతిక్రమించిన వారిపై అధికారులు చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.


12 కార్డుల్లో ఏదో ఒకటి...

ఓటరు స్లిప్పు పంపిణీ జరగకపోయినా నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయొచ్చు. బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారు. అక్కడ బీఎల్‌వోలను కలిసి ఓటరు స్లిప్పు తీసుకుని ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఓటరు కార్డు లేకపోతే ఎన్నికల సంఘం సూచించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపి ఓటు వేయవచ్చు.

ఇదీ వరస...

- ఓటుహక్కు ఉన్న వారు మీకు కేటాయించిన పోలింగ్‌స్టేషన్‌కు వెళ్లేటప్పుడు కచ్చితంగా ఓటరు స్లిప్‌తో పాటు గుర్తింపుకార్డు వెంట తీసుకెళ్లాలి. ఒకవేళ గుర్తింపు కార్డు లేకపోతే ఎన్నికల సంఘం సూచించిన 12గుర్తింపు కార్డుల్లో ఏదైనా వెంట తీసుకెళ్లాలి. కేంద్రంలోని పోలింగ్‌బూత్ వద్ద క్రమశిక్షణగా క్యూలో నిలబడి ఉండాలి.
- బూత్ లోపలికి వెళ్లాక మొదట పోలింగ్ అధికారి వద్ద మీ పేరు, క్రమసంఖ్యను తెలపాలి. ఆయన తన వద్ద ఓటరు లిస్టులో ఓటర్ ఐడీ,పేరు, సీరియల్ నంబర్ చెక్‌చేసి నిర్ధారిస్తారు. మీ వివరాలను అందరికీ తెలిసేలా చెబుతారు. పక్కనే ఉన్న వివిధ పార్టీల అభ్యర్థుల తరఫున ఉండే పోలింగ్ ఏజెంట్లు ఆ వివరాలను తన వద్ద ఉన్న ఓటరు లిస్టులో చెక్ చేసుకుంటారు. ఇక్కడ ఏదైనా తేడా వస్తే ఏజెంట్లు అభ్యంతరం తెలిపే అవకాశం కూడా లేకపోలేదు.
- ఆ తర్వాత రెండో పోలింగ్ అధికారి వద్దకు వెళ్లాలి. అతను మీ ఎడమ చేతి చూపుడు వేలి గోటిపై సిరా చుక్క అద్దుతారు. మూడో పోలింగ్ అధికారి వద్దకు వెళ్లాలి. అక్కడ ఆయన ఓటర్ స్లిప్ తీసుకుని అప్పటికే ఓటింగ్‌కు సిద్ధం చేసిన ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌ను కేటాయిస్తారు. రహస్యంగా ఉంచేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈవీఎం ఉంటుంది.
- మీకు కేటాయించిన ఈవీఎం యూనిట్ దగ్గరికి వెళ్లాలి. అక్కడున్న ఈవీఎం బ్యాలెట్‌లో పోటీలో ఉన్న అందరి అభ్యర్థుల పేర్లు, ఫొటోలు, గుర్తులు వరుస క్రమంలో ఉంటాయి. వాటిని గమనించి నచ్చిన పార్టీ ఎదురుగా గల బటన్‌ను గట్టిగా నొక్కాలి. రెడ్‌లైట్ రావడంతోపాటు బీప్‌సౌండ్ వస్తుంది. అప్పుడు మీ ఓటు వినియోగించుకున్నట్టు అర్థం. అదే సమయంలో పక్కన ఉన్న వీవీప్యాట్‌లో మీరు ఏ గుర్తుకు ఓటు వేశారో ఆ గుర్తు కనిపిస్తుంది. దాన్ని కూడా గమనించి మీరు వేసిన ఓటు సరిగ్గా నమోదైందా..లేదా అనేది నిర్ధారించుకోవచ్చు.
- అక్కడ నుంచి మీకు కేటాయించిన దారి గుండా బయటికి వెళ్లాలి. ఎవరికి ఓటు వేశారో మీ అంతరాత్మకు మాత్రమే తెలియాలి. బయటికి చెప్పొద్దు.

నకిలీ మద్యం తయారు చేస్తున్న ఐదుగురి అరెస్టు



మద్యం తయారు చేస్తున్న నిందితులతో ఎస్ఈబీ అధికారులు

రంగంపేట: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన దాడుల్లో నకిలీ మద్యం తయారు చేస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ ఎస్.రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పిట్టా సోమసేఖర్ ఆదేశాల మేరకు స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించగా నల్లమిల్లి, సింగంపల్లి, ఆనూరు గ్రామాల్లో నకిలీ మద్యం తయారు చేస్తున్న మామిడాల సూరిబాబు, మేడిశెట్టి సతీష్, బల్ల వీరప్రభ, యాగా రాంబాబు, నాగులపల్లి బాబూరావులను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 20 లీటర్ల నకిలీ మద్యం, ఐదు మొబైల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ జి.అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణం



చంద్రప్రభ వాహనంపై భద్రకాళీ సమేత వీరేశ్వరుడు

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వీరేశ్వరుని కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఎదురు సన్నాహం, ద్వాదశ ఆలయ ప్రదక్షిణ అనంతరం నిర్వహించిన స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వీరేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు రెండో రోజు అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర ఆదిశైవ అర్చక సంఘ అధ్యక్షుడు యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ఆదివారం ఉదయం సరస్వతి హోమం, రుద్ర హోమం చేశారు. సాయంత్రం భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించిన చంద్ర ప్రభ వాహనంపై గ్రామోత్సవం జరిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షిస్తున్నారు. ఆలయ ఆవరణలో భారీ చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఆదిశంకరాచార్య జయంతిని పురస్కరించుకుని మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శంకర జయంతి ఉత్సవం జరిగింది. కార్యక్రమంలో గంటి సుబ్రహ్మణ్య శర్మ, ఉండి దత్తు, గ్రామస్తులు పాల్గొన్నారు.